# కాటుక కళ్లు - కథలు మూడు

రైలు ఊపిరి తీసుకోవడం కూడా మరచి పోయి పరుగు తీస్తున్నది. సుందర్రావు కిటికీ దగ్గర కూర్చుని బయట విశాల ప్రపంచంలో వెనక్కి తప్పుకుంటూ ఉన్న ప్రకృతి సుందర దృశ్యాలను ప్రకృతి అందాలను తనివితీరా చూస్తున్నాడు. తోటి ప్రయాణీకులు కిటికీకి ఆవల ముగ్ధమనోహర దృశ్య ప్రపంచాన్ని చూడటంలేదు. వాళ్లల్లో వాళ్లు ముచ్చట్లు పెట్టుకొని కొందరు, పత్రికలో, పుస్తకాలో చదువుకుంటూ కొందరు, నిద్రతో జోగుతూ కొందరు కనిపించటంతో సుందర్రావు వాళ్ల పట్ల దిగులు పడ్డాడు. పెద్ద పెద్ద చెరువులు, సెలయేళ్లు, నదులు, గుట్టలు, కొండలు, పంటపొలాలు, పల్లెటూళ్లు, తోటలు, రకరకాల చెట్లు ఈ అందాలన్నీ సుందర్రావును ఆకర్షిస్తున్నాయి. కిటికీ దగ్గర తనకు చోటు దొరికినందుకు తన అదృష్టానికి తనే మురిసిపోతున్నాడు సుందర్రావు. అన్నీ చిత్రకారుని వర్ణచిత్రాల్లా తమ అందాలతో మురిపిస్తున్నాయి. ఊళ్లు సైతం వాకిట పశువులతో, రంగురంగుల దుస్తులు మనుషులతో, ఆటలాడుకుంటున్న చిన్నపిల్లలతో కొత్తగా కన్పించసాగాయి. అంతలోనే ఆ సుందర దృశ్యాలు అదృశ్యమైపోతున్నాయి.

సుందర్రావు బయట ప్రకృతి దృశ్యాలను చూస్తూనే మనసులో మనుషుల గురించి మధ్య మధ్య ఆలోచిస్తున్నాడు. ఆ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణీకులు నిండా ఉన్నారు. సాయంత్రం వెలుగులు కంపార్ట్‌మెంట్ లోపలికి దూసుకువస్తున్నాయి. రైలు మోత చెవుళ్లను గింగిర్లెత్తిస్తున్నది.

మిత్రుడు ప్రకాశం పెళ్లి చేసుకుంటున్నాడు. కులాంతరం పెళ్లి. పెళ్లికి తప్పక రావాలని ఉత్తరం రాశాడు. కులాంతర వివాహాన్ని ఇతర స్నేహితులతో పాటు సుందర్రావు ప్రోత్సహించాడు. కొత్త యువతరం సంస్కార భావాలకి బద్ధుడై మూఢాచారాలపై తిరుగుబాటు చేయటం సంతోషంగా ఉంది సుందర్రావుకు. యువతరం ప్రగతిపథంలో ఉన్నత ఆదర్శాలతో ముందుకు సాగుతున్నది. కాలం మారుతున్నది. 'దేశాభిమానం నాకు కద్దని వొట్టి గొప్పలు చెప్పుకోకోయ్. వొట్టి మాటలు కట్టి పెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్.'

జిల్లాపరిషత్ ఆఫీస్‌లో ప్రకాశం ఒక సామాన్యమైన గుమస్తా. అద్దెగది హోటల్ భోజనం బతుకు. తల్లితండ్రులు చెప్పినట్టు నడుచుకుని ఉంటే కట్నంతో, కానుకల్తో సుఖపడేవాడే. ఆ సుఖాన్ని కాలదన్నుతున్నాడు ప్రకాశం. ఇంత గొప్ప సంస్కారం ప్రకాశంలో, ఇంత

బలంగా ఉందనుకోలేదు సుందర్రావు. కసాయివాడ్ని నమ్ముకునే గొర్రెల్లాంటి వాళ్లు వీళ్లంతా అని తన తోటివారి గురించి బాధపడేవాడు. అట్లాంటి అతి సామాన్యుడయిన ప్రకాశం ఇంత గొప్ప సాహసం చేస్తుంటే సంతోషంగా ఉంది. అతడిని గుండెకు హత్తుకుని అభినందించాలని కూడా ఉంది. ఆ అమ్మాయి గురించి గతసారి కలుసుకున్నప్పుడు ప్రకాశం తనకు చెప్పుకున్నాడు. తమ ప్రణయ కలాపాలన్నీ చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్పాడు. ఎదురింటి టైలర్‌గారి అమ్మాయి. పదోతరగతి చదువు. పొడుగ్గా, సన్నగా, పెద్దకండ్లతో ఇట్టే ఆకర్షించే అందం. అమాయకమైన చూపులు. ప్రకాశం అదృష్టవంతుడే అన్పించింది సుందర్రావుకి.

బలరాం కూడా ఇట్లాంటి ఆదర్శంతోనే పెళ్లిచేసుకున్నాడు. అయితే బలరాం ఆదర్శంలో ముందుచూపుంది. అమ్మాయి గ్రాడ్యుయేట్. ఉద్యోగం చేస్తున్నది. సంపాదిస్తున్నది. బలరాంది ముందుచూపున్న ఆదర్శం.

మన సమాజంలో కులభేదాలను రూపుమాపాలంటే ఈ కులాంతర వివాహాలే శరణ్యం. కులభేదాలు పోయి మానవీయమైన అనుబంధాలతో కొత్త సమాజం ఏర్పడటానికి ఈ సంస్కార వివాహాలు తప్పక దోహద పడతాయని సుందర్రావు నమ్మకం. ప్రకాశం బలరాంలాంటి వాళ్లే ముందు తరాల వాళ్లకి దారిచూపే వాళ్లు. రైలు పలాస స్టేషన్‌లో ఆగింది. పాసింజర్ రైలు. అది వాటరింగ్ స్టేషన్. అక్కడ చాలాసేపే ఆగుతుంది. వచ్చేపోయే ప్రయాణికులతో కంపార్ట్‌మెంట్ సందడిగా ఉంది. ఫ్లాట్‌ఫార్మ్ కూడా సందడిగానే ఉంది. రైలెక్కుతున్న వాళ్లల్లో బలరాం కన్పించాడు. తన కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చి మొత్తం కంపార్ట్‌మెంట్ ఒకసారి ఇటూ అటూ తిరిగి కలియజూసాడు. కాని సుందర్రావు అతడికి కన్పించలేదు.

తన సంతోషం ఆపుకోలేక 'బలరాం' అని పిలుస్తూ చప్పట్లు కొట్టాడు. ఒంటరిగా ప్రయాణం చేస్తున్న సుందర్రావుకు స్నేహితుడు కలవడం సంతోషంగా ఉంది. తనను చూసి బలరాం తనదగ్గరకు వచ్చేసరికి ఉప్పొంగిపోయాడు. ఎదురుగా కూర్చుంటూ 'చూశావా ఇలా ఉండాలి ప్రయాణమంటే. నువ్వు ఎంత తప్పించుకు తిరుగుదామనుకున్నా కలుసుకోకుండా ఉండ లేవు' అని ఆత్మీయంగా మిత్రుని రెండు చేతులు పట్టుకుని గలగలా నవ్వేశాడు బలరాం.

బలరాం ఎక్కడ ఉంటే అక్కడ నవ్వులు కురుస్తాయి. తన మేలు కోరే స్నేహితుడిని సుందర్రావు కావలించుకున్నంత పనీ చేశాడు. 'బావున్నారా?' అన్నాడు. ఈసారి బావున్నారా అనటంలో అర్థం దంపతులు ఇద్దరూ, తల్లీ తండ్రీ అంతా బావున్నారా అని. నిర్మలమైన ఒక నవ్వునవ్వి అదే నవ్వుతో అంతా బావున్నామని సమాధానం

చెప్పుకున్నాడు బలరాం. బలరాం ప్రక్కనే ఉంటే ఆ చుట్టూ వాతావరణ సైతం మారిపోతుంది. ఇప్పుడు ఆ ఇద్దరు స్నేహితుల ప్రేమని చూసి తోటి ప్రయాణీకులు సైతం సరదాపడ్డారు. ప్రయాణీకులు లోపలికి వస్తూనే ఉన్నారు. ఆడామగా చిన్నా పెద్దా బలరాంతో పాటే వచ్చి కూర్చున్న కాటుక కళ్ళ అమ్మాయి కూడా ఒక నవ్వు నవ్వింది. ఎప్పుడూ సంతోషంగా ఉండడం చూస్తే బలరాంకి జీవితంలో కష్టాలంటే ఏమిటో తెలీదు అన్పిస్తుంది. మనసులో ఏదీ దాచుకోడు. తన మనసులో ఉన్నది ఉన్నట్టు మాట్లాడే స్వేచ్ఛమైన వ్యక్తిత్వం. తమ స్నేహితులను గుర్తుతెచ్చుకుని వాళ్ళ గురించి మాట్లాడుకున్నారు ఇద్దరూ. అంతా సెంకడరీగ్రేడ్ ఉపాధ్యాయ శిక్షణాకాలంలో శ్రీకాకుళంలో ఒక ఏడాదిపాటు కలిసి ఉన్నారు. ఆ స్నేహాలు, ఆ స్వప్నాలు, ఆ జ్ఞాపకాలు కలబోసుకున్నారు. మరోసారి ట్రైనింగ్ స్కూల్ వాతావరణంలో, ఆ క్రోటన్ మొక్కల మధ్య, ఆ అరటి చెట్లల్లో, ఆ నూతి గట్టు దగ్గర వందమంది గోల విన్పించింది. అప్పటి తమ లెక్చరర్స్ గురించి మంచీ చెడ్డా వాళ్ళ మాటల్లో దొర్లిపాయాయి. బలరాం కలవటం మూలంగా ఆ స్నేహితులంతా ఇప్పుడు గుర్తొచ్చారు. శిక్షణ ముగిసి ఉద్యోగాల్లో చేరి కూడా నాలుగయిదేళ్ళు అయింది. బలరాం స్నేహితులనే కాదు మొత్తం ప్రపంచాన్ని దినపత్రికలా చేతికి అందించగల స్కాట్ నాయకుడు.

తన అవసరం ఉన్నదీ అంటే చాలు వచ్చి ఆదుకునే మనస్తత్వంతో ఆ రోజుల్లో అందరికీ ఆపద్బాంధవుడయిన వాడు. లెక్చరర్‌లు సైతం బలరాం దగ్గర స్నేహితుల్లాగే ప్రవర్తించేవాళ్ళు. ఇక తోటివిద్యార్థినీ విద్యార్థులు సంగతి. ఇంటిమనిషిలా బలరాంని చూసేవాళ్ళు.

రైలు కదిలింది.

ఇద్దరూ ప్రస్తుతం తాము ఏ ఊళ్లో ఉంటున్నదీ చెప్పుకున్నారు.

'ఇంతకీ నువ్వు పెళ్లికి ఎందుకురాలేదో సంజాయిషీ ఇచ్చుకో' బలరాం అడిగాడు.

ఇంకొర్రైతే బలరాం ప్రశ్నకి క్షమాపణ చెప్పుకోవలసిందే. తనకి బలరాం శుభలేఖ సకాలంలోనే ఇంటి చిర్నామాకి అందింది. బలరాం తిరుపతిలో పెళ్లి చేసుకున్నాడు. ప్రేమ వివాహం. కులాంతరం. తల్లిదండ్రులకు బొత్తిగా ఇష్టంలేదు. పెళ్లిని తీవ్రంగా తల్లిదండ్రులు వ్యతిరేకించారు. సుందర్రావు ఉద్యోగం ఒరిస్సాలోని బరంపురంలో ఒక తెలుగు హైస్కూల్‌లో. సెలవుల్లేవు. 'ఎక్కడో అలవైకుంఠపురంలో నువు పెళ్లి చేసుకుని మమ్మల్ని రాలేదని నిందించడం న్యాయంకాదు' అన్నాడు సుందర్రావు నవ్వుతూ.

'ఇంతకీ ఆ శకుంతల ఎవరు? ఈ దుష్యంత మహారాజు ఎక్కడా?'

నవ్వాడు బలరాం. నవ్వే సమాధానం.

'ఇంతకీ భరతుడు ఉదయించాడా చెప్పు.'

భరతుడు ఇంకా ఉదయించలేదట.

'లోకనాథం పెళ్లికి వెళ్లావా?' బలరాం.

'పోలేకపోయాను. మాఇంటి చిర్నామాకు వచ్చింది శుభలేఖ.'

'నా బరంపురం చిర్నామా వాడికి తెలీదు. నేను ఊరు వెళ్లినప్పుడు చూసుకునే సరికి పెళ్లయి వారం రోజులు గడిచిపోయింది. శుభాకాంక్షలు చెప్తూ తర్వాత ఉత్తరం రాశాను.'

లోకనాథం ట్రెనింగ్ రోజుల్లో వేదికల మీద ఉన్నత ఆదర్శాల గురించి ఉద్రేకంగా మాట్లాడేవాడు. ఇట్లా మేనరికం చేసుకుంటాడని ఎవరూ అనుకోలేదు. ఆ పెళ్లికి బలరాం కూడా వెళ్లలేదట. అతడికి శుభలేఖ అందనే లేదు. తర్వాత కలిసినప్పుడు బలరాం 'ఏమిటి గొప్ప గొప్ప ఆదర్శాలు చెప్పిన నీవు చివరకు మేనరికం చేసుకున్నావా?' అని నిలదీస్తే 'మేము ప్రేమించుకున్నాము. జానకికి మోసం చేయలేకపోయాను.' అని తన సంజాయిషీ చెప్పుకున్నాడట లోకనాథం. ఈ కథ ఆ పెళ్లి రోజుల్లో అందరూ చెప్పుకున్నదే. ఆచరణ సాధ్యం కాని ఆదర్శాలను బోధించటం బుద్ధి తక్కువకదా.

కాటుక కళ్ల అమ్మాయి దూరమవుతున్న తన చిన్న పల్లెని చూస్తున్నది. ఏ అందాలనో, ఏ అనురాగాలనో ఆ ఊళ్లో మరచిపోయి వచ్చేసినట్టున్నాయి ఆమె చూపులు. ఆ పల్లెలో ఎవరో ఆమెని తీయగా పిలుస్తున్నట్టు, తనకోసం ఎవరో వెతుక్కుంటూ పరుగెత్తుకు తన వేపే రైలు వెంబడే వస్తున్నట్టూ ఆమె చూస్తున్నది.

'లోకనాథం ఇట్లాంటి మేనరికం పెళ్లి చేసుకుంటాడని నువు ఊహించావా?'

'పాపం పరిస్థితులు అనుకూలించలేదు. తల్లిదండ్రులంటే వాడికి ప్రేమ. వాళ్లు చెప్పినదాన్ని వ్యతిరేకించలేడు. ముద్దుగా పెంచారు. ఒక్కడే కొడుకు. వాడి మీద ఎంతో నమ్మకం. పైగా చిన్నరైతు కుటుంబం. ఆ భూమి అమ్ముకుని కొడుకును చదివించారు. వాడు పోషించకపోతే తల్లిదండ్రులకు బతుకుసాగడం కష్టమే. బావంటే మనసిచ్చిన మేనకోడలు. చిన్ననాటినుంచి అందమైన ప్రేమలతో పెరిగింది. బావ తప్పించి ఇంకో లోకం తెలీదు. అట్లాంటి దివ్యమైన అనుబంధాల అనురాగాలని కేవలం ఒక ఆదర్శంకోసం ఎట్లా విడుచుకుంటాడు చెప్పు? వాడు సాహసం చేసి ఆదర్శం కోసం తనని మనసారా ప్రేమించిన మేనగోడలని విడిచిపెట్టుకుంటే, ఆ తల్లిదండ్రుల బాధ ఎట్లా ఉంటుందో చెప్పు? అవన్నీ - ఆ అమ్మాయి - బావ వేరే పెళ్లి చేసుకున్నాడన్న నిరాశతో ఆత్మహత్య చేసుకుంటే - పత్రికల్లో మనం రోజు చదవటం లేదా ఆడపిల్లల ఆత్మహత్యల గురించి? అన్నీ జాగ్రత్తగా ఆలోచించాడు లోకనాథం' అన్నాడు బలరాం.

లోకనాథంకి ఉన్న బంధాలన్నీ బలరాంకీ ఉన్నాయి. తల్లీతండ్రీ ముద్దుగా పెంచారు.

సంతానంలో పెద్దవాడు. తల్లితండ్రులు ఎన్నో మంచి సంబంధాలు చూశారు. మేనరికం కూడా ఉంది. తమ్ముళ్లు చెల్లెళ్లూ ఉన్నారు. అయినప్పటికీ ఆదర్శం కోసం కులాంతర్వివాహం చేసుకున్నాడుకదా.

ఆ కాటుక కళ్ల పల్లెపడుచు ఆ మిత్రుల సంభాషణ వినటం లేదు. ఎదురుగా కిటికీ దగ్గర కూర్చుని ఉన్న సుందర్రావును మాత్రం మధ్య మధ్య చూస్తున్నది. ఆమె ప్రక్కనే కూర్చున్న మొలకి గోచి, తలకి పెద్ద తలపాగా తప్ప ఒంటిమీద వేరే గుడ్డలు ఏమీలేని తాత, చేతికర్రని పాదాల దగ్గర పెట్టుకున్నాడు.

ఆ కాటుక కళ్ల పల్లెపడుచు జాకెట్టు లేదు. ఆ ప్రాంతంలో జాకెట్ల అలవాటు లేదు. ఆదివాసీల్లా ఉంటారు. మెడలో నల్లపూసల మంగళసూత్రం లేదు. పాదాల వేళ్లకు మట్టెలు కూడా లేవు. వితంతువా అంటె కాదు. నుదుట బొట్టుంది. ఆ వయసు యువతులు పెళ్లి కాని కన్యలుగా ఉండే అవకాశం లేదు. తమ ప్రాంతం ఆచారవ్యవహారాలు సుందర్రావుకు తెలిసినవే. కలువరేకుల్లాంటి కళ్లకు కాటుక దిద్దింది. చల్లని ఉదయం వెల్తుర్లో స్వచ్ఛమైన చెరువు నీళ్లల్లో చేపల్లా కొట్టుకుంటున్నాయా చూపులు. ప్రకృతి ఎరువిచ్చిన యవ్వనమే ఆమె అలంకారం. ఆ అమ్మాయిని చూస్తుంటే సుందర్రావు గుండెల్లో కొన్నాళ్లుగా మండుతున్న దావానలం ఒక్కసారి చల్లారిపోయి చల్లని ప్రభాత పవనం జోకొట్టినట్టయింది. ఇంత అమాయకంగా, స్వచ్ఛంగా మనుషులుంటే ప్రపంచం ఎంత అందంగా ఉండేదో కదా. ఆమె ఆవు దూడలతో ఆడుకుంటుంది. పెరట్లో పూల మొక్కలను ముద్దుపెట్టుకుని మురిసిపోతుంది. వంట చేలల్లో పనులు చేసుకుంటున్నప్పుడు తోటి అమ్మలక్కలతో గొంతు కలిపి పల్లెపదాలు పాడుకుంటుంది. పాడి పశువులనూ, గొర్రెలనూ, మేకలనూ తమ స్వంత మనుషుల్లా భావించి వాటిని ప్రేమించే ఆ జీవితాలు అంత అందమైనవి! కానీ తనకో..... చదువు.... అశాంతి. ఆదర్శాలు.... అశాంతి. బాధ్యతలు... అశాంతి. ఉద్యోగం.... అశాంతి.

సుందర్రావుకు పెళ్లి ఇష్టం లేదు. ఇంకా చదువుకోవాలి. చదువులో ఏదో ఆకర్షణ. గ్రాడ్యుయేషన్ చెయ్యాలి. బి.ఇడి చెయ్యాలి. ప్రమోషన్ సంపాదించుకోవాలి. తన అశాంతికి కారణాలు పై ఉద్యోగంతో, ఆదాయంతో సర్దుకు పోతాయి. తల్లిదండ్రులకు అండగా నిలబడాలి. చెల్లెళ్లు ముగ్గురూ చదువుకుంటున్నారు. తను ఆర్థిక ఇబ్బందుల కారణంగా కాలేజీ చదువులు చదవలేకపోయిన చెల్లెళ్లను చదివించాలి. అదృష్టవశాత్తు చదువంటే వాళ్లకు ఇష్టం. తెలివైన తన చెల్లెళ్లను తనే చదివించగలడు.

తనతో పాటే సెకండరీగ్రేడ్ చేసిన బలరాం నాలుగేళ్లల్లోనే బి.ఇడి చేసి ప్రమోషన్ వచ్చి, ఇప్పుడు బి.ఇడి అసిస్టెంట్‌గా ఉన్నాడు.

ఇంకో స్టేషన్‌లో రైలు ఆగింది. వచ్చిపోయే ప్రయాణీకులు. మూటలు, సంచులూ, చిన్నపిల్లలూ సందడి. ఇద్దరు బిచ్చగాళ్ళు భార్యభర్తలు లోపలికి వచ్చి పాటలు మొదలుపెట్టారు.

'లోకనాథంకి పిల్లలా?'

'తెలీదు. ఎక్కడ ఉన్నాడో కూడా తెలీదు. గత ఏడాదిగా ఉత్తరాల్లేవు.' బలరాం జీవితం సుందర్రావుకి అందంగా కనబడింది. ఆదర్శము, ప్రేమ, సహాయ స్వభావము, నవ్వులు మొదట్నించి అతడికి ఇష్టమే.

'మీ నాన్నగారికి మీ మీద కోపం పోయిందా?' ఈ ప్రశ్న అడగకూడదనుకుని చివరకు అడిగాడు సుందర్రావు.

పెళ్లి తర్వాత కుటుంబానికి బలరాం దూరమయ్యాడు. ఇంటికి తల్లిదండ్రులు రానివ్వలేదు. ఆరుగురు అన్నదమ్ముల పెద్ద కుటుంబం. ఆ పిల్లల పెళ్లిళ్లు ఎట్లా చెయ్యాలి. బ్రాహ్మణుడై చిన్న కులం వేశ్యావృత్తి కుటుంబం నించి వచ్చిన అమ్మాయిని చేసుకోవడం 'నువు చచ్చావనుకుంటాం' దగ్గర ఆగింది.

'అయిదేళ్లయింది. ఇంటి ముఖం చూడలేదు. తమ్ముళ్లను, చెల్లెళ్లనూ, నరే తల్లినీ తండ్రినీ - చూడనేలేదు. నాతర్వాత వాడు బి.ఏ చదువు ఆఖరి సంవత్సరం ఆగిపోయింది. పెళ్లివయసు చెల్లెళ్లు. పదిరోజుల క్రితం -' అని కన్నీరు పెట్టుకున్నాడు బలరాం. 'మా అమ్మ చనిపోయింది. అయినా నాకు తెలియజేయలేదు. స్నేహితుడు ఉత్తరం రాస్తే తెలిసింది. ఇప్పుడు వెళుతున్నాను.' అమ్మ ప్రేమ అతడి కళ్లల్లో కన్నీళ్లై కురుస్తున్నది. తల్లిని చివరిసారి చూడలేకపోయాడు. కొమ్మకొమ్మకూ పూచిన అమ్మ ప్రేమతో హృదయం రోదిస్తున్నది.

రైలు ఆగింది. ఆ కాటుక కళ్ల పల్లెపడుచు ఆ స్టేషన్‌లో దిగిపోయింది. రైలు మళ్లా పరుగు సాగించింది.

బలరాం జీవితంలో ఆదర్శం సృష్టించిన సంక్షోభం ఇప్పుడు సుందర్రావుకు భయంకరంగా, తట్టుకోలేనంతగా ఘోరంగా ఉంది. సుందర్రావు కళ్లల్లోంచి కన్నీళ్లు కురిసాయి.

కొద్దిసేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు. బిచ్చగాళ్లు తత్త్వం పాడుతున్నారు. వాళ్ల చేతుల్లో పైసలు పెట్టాడు బలరాం. కళ్లుతుడుచుకుని గుండె దిటవు చేసుకున్నాడు. స్నేహితుని కన్నీళ్లు తన జేబురుమాలుతో తుడిచాడు సుందరరావు.

'కొందరి జీవితాలు అట్లాగే ఉంటాయి' అన్నాడు నెమ్మదిగా బలరాం.

ముఖంలో మళ్లీ చిర్నవ్వు వెలిగింది.

'బాధలు ఎవరికుండవు చెప్పు? మనసు నిర్మలమైతేనే గాని ఈ బాధలు పోవు. దేని మీదో అందని అందం మీద ఆ కాంక్ష ఉండనే ఉంటుంది. లోకంలో మహాత్ములను చూసి, వారి కథలు విని, ఉన్నతంగా జీవించాలన్న ఆశయం మంచిదే కదా.' అన్నాడు బలరాం.

సుందర్రావుకు ఆ పల్లెపడుచు గుర్తు కొచ్చింది. ఆ కాటుక కళ్లు గుర్తుకొచ్చాయి. ఈ కొత్త ఆదర్శాల నాగరికతకు దూరంగా బతుకుతున్న ఆమె కళ్లల్లోని అమాయకత్వం గుర్తొచ్చింది.

'నన్ను నమ్మి నా జీవిత సహచర్యం కోసం ఒక ప్రేమమూర్తి వచ్చిందికదా, ఆమె కోసం ఎన్ని కష్టాలనన్నా ఎదుర్కోవాలి. తప్పదు' అన్నాడు ధైర్యంగా బలరాం.

బలరాం దిగబోయే స్టేషన్ సమీపిస్తున్నది. రైలు సిగ్నల్ లేకనో ఏమో వేగం తగ్గించి నెమ్మదిగా పోతున్నది. బలరాం రైలు దిగబోయాడు. బలరాం వచ్చే స్టేషన్‌లో దిగుతాడనుకున్నాడు సుందర్రావు.

అయ్యయ్యో.....అయ్యయ్యో..... రైలుకింద పడిపోయాడు.... చక్రాలు కింద పడిపోయాడు.... పాపం పాపం... చచ్చిపోయాడు. చచ్చిపోయాడు. రైల్లోంచి, ఇతర కంపార్ట్‌మెంట్లనించి దిగిచూసిన ప్రయాణీకులు గుండెలు కొట్టుకుంటున్నారు. వాట్ మేడ్ హిమ్ హర్రీ.... ఆయువు నిండింది.... పాపం కాలు జారిందో, చెయ్యి జారిందో.... నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది.... బొప్పామొరిగొల్లారే.... మొరిగొల్లా.... పూర్‌క్రీచర్. అంతా రాత. బండి ఆగందే ఏమిటా తొందర.... హై స్కూల్ మాష్టరట. మేష్టరుగారిది మా ఊరే.... పెళ్లాం కూడా మేష్టరేనట. ఆ మనిషి ఆయన స్నేహితుడే. యమదూతలొచ్చి తీసుకుపోయినారంతే. అంతా రాత. ఎవరమూ తప్పించుకోలేం. భగవంతుడా! భగవంతుడా!....ఆ కళ్లెలా కొట్టుకుంటున్నయో చూడండి..... అబ్బబ్బా ఘోరం జరిగిపోయింది....ఘోరం జరిగిపోయింది....ఘోరం....

జనం తొక్కుకుంటూ, తోసుకుంటూ, భయపడుతూ, బాధపడుతూ కన్నీళ్లు పెట్టుకుంటూ. ఎవరో ఒక స్త్రీ ప్రమాదం చూసి కళ్లు తిరిగి కింద పడిపోయింది. పాతికేళ్లుంటాయో ఏమో. సుందర్రావు వొళ్లంతా వణుకు. తనదే తప్పుఅన్నట్టు బాధ. కన్నీళ్లు. గుండె కొట్టుకుంటున్నది. తన కళ్ల ముందే తన స్నేహితుడు. ఆగు తొందరెందుకు అనాల్సింది.

గార్డు, డ్రైవరు, చాలామందే.

స్టేషన్ మాష్టరు, ఇతర సిబ్బంది కూడా వచ్చారు. అంతలోనే పోలీసులు అక్కడ చేరారు.

చెమట్లు పట్టేసాయి సుందర్రావుకి.

వందలాదిమంది ప్రయాణీకుల అశ్రుతర్పణ.....

ఆ ముసలి తాత కూడా పొడవు చేతికర్రతో పాటు దిగాడు కిందికి. ఆ తాత కళ్లల్లో కూడా కన్నీళ్లు.

సుందర్రావు ఇంక ముందుకు ప్రయాణం సాగించలేదు. ముందు స్టేషన్‌లో దిగిపోయి వెనక్కి ఆ సాయంత్రమే తిరిగి ఇంటికి వచ్చేశాడు. ప్రకాశరావు పెళ్లికి వెళ్ల లేదు. తర్వాత గ్రీటింగ్స్ పంపించాడు.

* * *

పదిహేను దినాల తర్వాత లోకనాధం ఉత్తరం అందింది. దాంట్లో లోకనాధం రాసిన సంగతులు సుందర్రావుకు దిగ్భ్రమ కలిగించాయి. తన కళ్లతో, స్వయంగా తనకళ్లతో చూసిన ప్రమాదాన్ని బలరాం ఆత్మహత్య చేసుకున్నాడని ఇప్పుడు ఇలా వ్యాఖ్యానించటం బాధగా ఉంది.

బలరాం ఆత్మహత్య చేసుకోలేదు.

ప్రమాదవశాత్తు చనిపోయాడు. అది సత్యం. అదే సంగతి లోకనాధానికి రాస్తున్నప్పుడు - కాటుక కళ్లతో ఆ పల్లెటూరి పడుచు తనని చూస్తున్నట్టు అన్పించింది. వెన్నాడుతున్న ఆ చూపు. ఆమెను చూడాలి. ఆ కాటుక కళ్లను. ఆ ఊరు - ఆమె రైలెక్కిన ఆ ఊరును చూడాలి.

*

*'స్రవంతి' సాహితీ మాసపత్రిక 1964*